క్లుప్తంగా

ఇంకుడు గుంతలు నిర్మించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: మురికి నాలా చివరన ఇంకుడుగుంత నిర్మించాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏ, ఎఫ్ఏలకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ గ్రామ పంచాయతీలో డ్రెయినేజీ ఎండ్ పాయింట్‌లో ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు. ఈ నెల 31 లోపు 3 లక్షల మొక్కలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

వాంకిడి: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని, జర్నలిస్టులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని తెలంగాణ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే -ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. బుధవారం మండల జర్నలిస్టులతో కలిసి సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపించారు.

కొనసాగుతున్న సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం కొనసాగింది. కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రమేశ్, పోశయ్య, సీఐటీయూ నాయకుడు లోకేష్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన ఎస్సై

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బస్టాండ్, పేట్‌మేళా, డౌనల్ ప్రాంతాలతో పాటు మండలంలోని సిర్పూర్ (టి) -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని వేంపల్లి రైల్వేగేటు వద్ద గుంతలమయంగా మారిన రోడ్లకు బుధవారం సిర్పూర్ (టి) ఎస్సై దీకొండ రమేశ్ మరమ్మతులు చేయించారు.

డీఎస్సీ నిర్వహించాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: టెట్, డీఎస్సీ వెంటనే ప్రకటించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడేకు యువ నాయకుడు ఆవిడపు ప్రణయ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రేషనలైజేషన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, లేకుంటే గ్రామీణ ప్రాంతాల పిల్లలు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలు బంద్

సిర్పూర్ (టి): మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి సిర్పూర్ (టి) నుంచి చీలపెల్లి వెళ్లే మార్గంలోని వాగు ఉప్పొంగడంతో కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. రాత్రి వాగు ఉధృతి తగ్గడంతో ప్రయాణికులు కాలిబాటతో వాగు దాటారు.

రైతు సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం కృషి

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలో రైతు సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శ్రీశైలం, సెర్ల మరళీధర్, అరుణ్‌లో, శ్రీధర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

రాష్ట్రంలో పేదలకు ఇస్తామన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవ్‌రావ్‌కు వినతిపత్రం సమర్పించారు.

పట్టాలు అందించాలి

సిరికొండ: మండలంలోని సాత్‌మోరి, లక్ష్మీపూర్, తుమ్మల్‌పాడ్, బోరింగ్‌గూడ గ్రామాల రైతులకు పోడుపట్టాలు ఇవ్వాలని బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బజ్‌పాయ్‌ను కలిశారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి, పట్టాలు, రైతుబంధు అమలు అయ్యేలా చూడాలన్నారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనేతరులు బుధవారం ఉట్నూర్‌లోని జెడ్పీచైర్మన్ నివాసంలో చైర్మన్ జనార్దన్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజనేతరుల భూములకు పట్టాలు, రైతుబంధు ఇవ్వాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జెడ్పీచైర్మన్ భరోసా ఇచ్చారు.

తడారని చేను..!



కనికి శివారులో తడారని పత్తి చేను

- అధిక వర్షాలతో పత్తిలో కలుపు సమస్య
- కూలీల కొరతతో ఇబ్బందులు
- ఆందోళనలో పత్తి రైతులు

కౌటాల: జిల్లా వ్యాప్తంగా గత పది రోజుల నుంచి కురుస్తున భారీ, మోస్తారు వర్షాలు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరద ముంపుతో పంటలు దెబ్బతినగా, చేలల్లో నీటి తడి ఆరకుండా కురుస్తున్న వర్షాలతో విపరీతంగా కలుపు పెరిగింది. లేత మొక్కలు చీడపీడల బారిన పడుతున్నాయి. సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు సైతం వెసులుబాటు లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కలుపు నివారించకుంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది. మరోవైపు కలుపు తీసేందుకు కూలీలు దొరక్క అన్నదాతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

4.51 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలోని 1.16 లక్షల మంది రైతులు జిల్లా వ్యాప్తంగా 4.51 ఎకరాల్లో వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా 3,35,178 ఎకరాల్లో పత్తి, 54,611 ఎకరాల్లో వరి, 46,096 ఎకరాల్లో కంది, 3017 ఎకరాల్లో పెసర, 1,524 ఎకరాల్లో సోయా సాగు చేయనున్నారు. జూన్ చివరిలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు విత్తుకోగా కొంత వరకు మొలకెత్తాయి. జూలై రెండో వారం నుంచి భారీ నుంచి మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పత్తి మొక్కలను మించి కలుపు పెరిగింది. ప్రస్తుతం ఒక్క పత్తి మొక్కకు 20 నుంచి 30 ఆకులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 10 ఆకులు దాటడంలేదు. నీటి నిల్వతో మొక్కలు కొన్ని పచ్చగా మారి ఎదుగుదల లోపించింది. ఎటుచూసినా కలుపు మొక్కలతో పంట చేలు గడ్డి మైదానాలను తలపిస్తున్నాయి. వర్షాలు తగ్గి భూమి తడి ఆరితే తప్ప కలుపు తీయలేని పరిస్థితి నెలకొంది.

కలుపు భారం

ఈసారి ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి పత్తి చేనుల్లో కలుపు మొక్కలు పెరగడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. కూలీల కొరత కారణంగా పత్తి రైతులు కలుపు మందులపై ఆధారపడుతున్నారు. అధికంగా ఖర్చు చేసి కలుపు మందులు పిచికారీ చేస్తున్నారు. పత్తి మొక్కల కంటే కలుపు మొక్కలే ఎక్కువగా ఉండటంతో ఎకరాకు 25 నుంచి 30 మంది వరకు కూలీలు అవసరమవుతున్నారు. దీనికితోడు గతంలో రోజు కూలీలకు ఒక్కొక్కరికి రూ. 200 ఉండేది. ప్రస్తుతం రోజు వారి కూలీ రూ.250 పెరిగింది. పెరిగిన ఖర్చులతో ఎకరాకు కనీసం 25 మంది కూలీలకు గానూ రూ.5000 ఖర్చవుతుంది. ప్రస్తుతం గ్రామాల్లో వరి నాట్లు వేస్తుండడంతో కూలీలు దొరకడం లేదు. పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకున్న రైతులు వ్యవసాయం చేయాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలుపుతో ఖర్చులు పెరిగాయి



భారీ వర్షాలు కురవడంతో పత్తిలో కలుపు మొక్కలు పెరిగాయి. దీంతో పంటలకు ఎరువులు వేసినా అందాల్సిన పోషకాలు కలుపు మొక్కలు హరిస్తున్నాయి. ఎకరం పత్తి చేనులో కలుపు మొక్కలు కలుపు తీయడానికి అదనంగా రూ.5వేల వరకు ఖర్చు వస్తోంది. ప్రస్తుతం చేను ఇంకా తడిగానే ఉంది. దీంతో గడ్డి మందు పిచికారీ చేస్తున్నాం. గ్రామాల్లో వరి నాట్లు వేస్తుండడంతో కూలీలు దొరకడం లేదు.

– రామయ్య, గురుడుపేట్

దివ్యాంగులకు పింఛన్ రూ.4016

- జూలై నుంచే పెంపు అమలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో లబ్ధిదారులు 5,974 మంది



ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణలో దివ్యాంగులకు సీఎం కేసీఆర్ శుభవార్త తెలిపారు. ప్రస్తుతం వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.3,016 పింఛన్‌ను రూ.4,016కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని దివ్యాంగులకు అందిస్తున్న ఆసరా పింఛన్ పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో జిల్లాలో 5,974 మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనుంది.

ఆశావహుల ఎదురుచూపులు..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన పింఛన్‌ల మంజూరుకు గతంలో చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ వాటిలో చాలా వరకు దరఖాస్తులను వివిధ కారణాలతో అధికారులు తిరస్కరించారు. అధికారులకు పదేపదే దరఖాస్తుదారులు విన్నవించినా తమ చేతుల్లో ఏమి లేదని, ఉన్నతాధికారులు పింఛన్‌లు మంజూరు చేస్తారని సమాధానం ఇస్తున్నారు. ప్రస్తుతం రూ.4వేల పింఛన్ కావడంతో దరఖాస్తుదారులు పైరవీలు చేస్తున్నారు.

కరువైన అధికారుల నిఘా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరుపేదలకు మాత్రమే పింఛన్ ఇవ్వాలి. కాని ఎంతో మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అనేక మండలాల్లో అర్హులైన వారికి పింఛన్‌లు మంజూరు కాకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ పింఛన్‌దారులను జాబితా నుంచి తొలగించేందుకు అధికారులు పకడ్బందీగా నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

పింఛన్ మంజూరు చేయండి



నాకు ఒక కాలు లేదు. ఐదేళ్ల క్రితం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పూర్తిగా కాలు తొలగించారు. ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే తిరస్కరించారు. ఎలాంటి ఆధారం లేని నాకు అధికారులు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– దత్తాత్రి, ఆసిఫాబాద్

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జుమ్మిడి సౌందర్య



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్

దహెగాం: పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యానవనం, ఈజీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులు, 5ఎకరాలలోపు భూమి ఉన్న వారికి వందశాతం సబ్సిడీపై పండ్ల మొక్కలు అందిస్తారన్నారు. బీసీ రైతులకు 90శాతం సబ్సిడీపై అందించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి వంశీక్రిష్ణ, ఈజీఎస్ ఏపీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి..

మండలంలోని గిరవెల్లి గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఎంపీడీవో మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని సూచించారు. మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌లు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పండ్ల తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి మంజుల, ఎంపీవో అంజద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఏపీడీ కుటుంబరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ శాఖ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మామిడి, నిమ్మ, సంత్ర, జీడి మామిడి, జామ, సీతాఫలం, సపోటా, ఆయిల్ పామ్, దానిమ్మ, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, జామున్ మొదలగు తోటల పెంపకానికి ఉపాధిహామీ పథకంలో అవకాశం ఉందన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఏవో మిలింద్ కుమార్, ఎంపీవో శివకుమార్, ఏపీవో శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అప్రోచ్ రోడ్డు



చిత్తడిగా మారిన రోడ్డు

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ వాగుపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు అధ్వానంగా మారింది. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో పాటు కాలినడకన వెళ్లే వారు సైతం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అప్రోచ్ రోడ్డు వేసేటప్పుడు గ్రామస్తులు బురదమయంగా మారుతుందని తెలిపినా సంబంధిత కాంట్రాక్టర్ ప్రజల మాటను పట్టించుకోకుండా క్వాలిటీ లేని గ్రావెల్ మొరం వేయడం ద్వారా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. వాగుపై వంతెన నిర్మించినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు



తనిఖీ చేస్తున్న ఏవో మిలింద్ కుమార్

వాంకిడి: ఫర్టిలైజర్ దుకాణదారులు ఎరువులు, పురుగు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో మిలింద్ కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాకు వివరాలు పరిశీలించారు. ఎరువులు, మందులు కొనుగోలు చేసే క్రమంలో రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. అమ్మకాలకు సంబంధించి వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని డీలర్లను ఆదేశించారు. రైతులను మోసం చేస్తూ ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపితే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

డీలర్లపై కేసులు నమోదు చేస్తాం

కౌటాల: గడవు తీరిన మందులు విక్రయిస్తే ఫర్టిలైజర్ షాపుల డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాగజ్‌నగర్ డివిజన్ సహాయ సంచాలకులు మనోహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రిజిస్టర్లు, స్టాక్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఏవో రాజేశ్, డీలర్లు ఉన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి

కాగజ్‌నగర్‌రూరల్: అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని ఈజ్‌గాం ఎస్సై రమన్ కుమార్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన మండువ గ్రామంలో బుధవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.

ఎక్స్ సర్వీస్‌మెన్‌ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



భోజనం వడ్డిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కోసిని గ్రామంలో అమరవీరుడు సంతోష్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఎస్పీఎం ఫంక్షన్‌హాల్‌లో స్థానిక దివ్యాంగుల పిల్లలకు టిఫిన్ బాక్సులు అందజేశారు. 50 మంది దివ్యాంగులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.శివ, జనరల్ సెక్రెటరీ సునీల్ మండల్, అబ్దుల్ నయీం, వినాయక్, మనోజ్ తివారి, విజయ్ కుమార్, అనురోధ్ సింగ్, అజయ్ సింగ్, కెన్నా రామ్, నీరజ సింగ్, ముఖేష్ సింగ్, అన్వర్, శ్రీనివాస్, శివప్రసాద్, ఉత్తమ్, పురుషోత్తం రతన్ గైస్ పాల్గొన్నారు.

భారీ వర్షం.. ఉప్పొంగిన వాగులు



దహెగాం: లోలెవల్ వంతెనపై నుంచి వెళ్తున్న వాహనదారులు

దహెగాం: మండలంలో బుధవారం భారీ వర్షం కురవడంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగాయి. మండల కేంద్రంతో పాటు ఐనం గ్రామం సమీపంలో ఉన్న లోలెవల్ వంతెనపై వరద నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున పత్తి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పత్తి చేలలో వర్షపు నీరు నిల్వడంతో పత్తి మొక్కలు ఎర్రబారుతున్నాయని వాపోతున్నారు.



అందవెల్లి పెద్దవాగును పరిశీలిస్తున్న సీఐ నాగరాజు, ఎస్సై రమన్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెద్దవాగు పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని అందవెల్లి పెద్దవాగును ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పెద్దవాగులో నీటిమట్టం ఎక్కువగా ఉన్నందున వాగును ఎవరూ దాటవద్దన్నారు. ఈజ్‌గాం ఎస్సై రమన్ కుమార్ ఉన్నారు.

దంచికొడుతున్న వానలు

తిర్యాణి: మండలంలో బుధవారం ఉదయం నుంచి వానలు దంచికొడుతున్నాయి. దీంతో మండలంలోని చింతపెల్లి గ్రామపంచాయతీ పరిధి నాయకపుగూడ గ్రామంలోని గంట బుచ్చయ్య, ఏదుల మల్లేశానికి చెందిన ఇళ్లకు సంబంధించిన గోడలు నేలమట్టమయ్యాయి.

డీసీఆర్‌బీ సీఐగా రమేశ్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ ఎస్సైగా పని చేసి పదోన్నతి పొందిన రమేశ్ బుధవారం డీసీఆర్‌బీ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సురేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కౌటాల ఎస్సైగా మధుకర్



సీఐకి మొక్క అందజేస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండల ఎస్సైగా బుధవారం పోలీస్‌స్టేషన్‌లో మధుకర్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని జైనూర్‌లో విధులు నిర్వహించి కౌటాలకు ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కౌటాల సీఐ ఎండీ సాధిక్ పాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కౌటాల ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రవీణ్‌కుమార్ ఆసిఫాబాద్ ఎస్బీకి బదిలీపై వెళ్లారు.

కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం



కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: మహిళలు చైతన్యవంతులు కావాలని స్పర్శ ఫౌండేషన్ సీఈవో కపిల్ కౌల్ అన్నారు. బుధవారం మండలంలోని చింతగూడ గ్రామపంచాయతీ పరిధిలో స్పర్శ ఫౌండేషన్, ఎస్పీఎం ఆధ్వర్యంలో కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా అభివృద్ధి సాధించాలన్నారు. జనరల్ మేనేజర్ గిరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, మహిళలు కుట్టు మిషన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిల్లు ప్రతినిధి తుమ్మ రమేశ్, గ్రామసర్పంచ్ ఆత్రం సంజీవ్, ఎంపీడీవో గౌరీశంకర్, ఏపీఎం ముక్తేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

సిర్పూర్ (టి): మండలంలోని హుడ్కిలి సెక్షన్ పరిధిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో పాటు స్థానికులకు బుధవారం సెక్షన్ అధికారి మోహన్ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అడవిలోకి వెళ్లకూడదని, అడవిలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. బీట్ అధికారులు షేక్‌షాహిద్, నరేశ్, రవీణా, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో వినాయక్‌నగర్ మీదుగా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సీఎం పర్యటన సందర్భంగా ఆగమేఘాలమీద ప్రారంభించిన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా డ్రెయినేజీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– ఆసిఫాబాద్‌అర్బన్

పదవీ విరమణ చేయనున్న అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

రెబ్బెన: పదవీ విరమణ చేయనున్న జీఎం (ఈఅండ్ఎం) స్వామినాయుడును బుధవారం గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్, అధికారులు స్వామి నాయుడును సన్మానించి మొక్కను అందజేశారు. అనంతరం అన్ని విభాగాల ఉన్నతాధికారులతో జీఎం (ఈఅండ్ఎం) సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటూ జీఎం నరేందర్, పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, పీఈ రాజాజీ, డీజీఎంలు సతీష్‌బాబు, ఉజ్వల్‌కుమార్, పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.